సాక్షి చిత్తూరు

మంగళవారం । 5 । డిసెంబర్ । 2023



పల్లెవాకిటే పత్రాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. పేదల అభ్యున్నతికి కృషి చేస్తోంది. - 10లో



దాతృత్వం ఎనలేనిది

ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి దాతృత్వం ఎనలేనిదని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు. - 10లో



టెన్నిస్ తారాజువ్వ సుమేరా

టెన్నిస్ వినీలాకాశంలో సుమేరా తారాజువ్వలా మెరిసింది. పట్టుదల..నిరంతర సాధనతో విజయపథంలో దూసుకెళుతోంది. - 10లో

న్యూస్‌రీల్

ట్రాన్స్‌కోకు రూ.14.4 లక్షల నష్టం



చిత్తూరులో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా పరిధిలో గాలివానతో సోమవారం రూ.14.4 లక్షలు నష్టం వాటిల్లిందని ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. మొత్తం 59 గ్రామాల్లో విద్యుత్ పరికరాలు దెబ్బతినగా 188 మంది విద్యుత్ సిబ్బంది మరమ్మతు పనులు చేసున్నారన్నారు. తిరుపతి ఆపరేషన్, తిరుపతి రూరల్, పుత్తూరు, చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, మదనపల్లె, పీలేరు, పుంగనూరులో 11 కేవీ ఫీడర్లు 58, 9.1 మీటర్ల విద్యుత్ స్తంభాలు 69, 8 మీటర్ల స్తంభాలు 108, 11 కేవీ లైన్ 3.4 కిలో మీటర్లు, ఎల్‌టీ లైన్ 11.64 కి.మీ, ట్రాన్స్‌ఫార్మర్లు 128 పాడైపోయాయని చెప్పారు. ఇందులో 11 కేవీ ఫీడర్లు 38, 9.1 మీటర్ల విద్యుత్ స్తంభాలు 16, 8 మీటర్ల స్తంభాలు 6, 11 కేవీ లైన్ 0.13 మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు 11 మార్పు చేశామని చెప్పారు.

స్పందన రద్దయినా కలెక్టరేట్‌లో రద్దీ



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో

చిత్తూరు కలెక్టరేట్: వర్షాల కారణంగా సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని అధికారులు రద్దు చేశారు. అయినప్పటికీ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి వినతులను స్వీకరించారు. ఆయా వినతులను సంబంధిత శాఖల అధికారులకు పంపి, నిర్ణీత సమయంలోపు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

జెడ్పీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: మిచాంగ్ తుపాన్ ప్రభావం నేపథ్యంలో జెడ్పీ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాలు, జెడ్పీ చైర్మన్ సూచనలు మేరకు కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు సోమవారం సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 08572-222817 నంబర్‌తో 24 గంటలు పనిచేస్తుందన్నారు. మండలాల్లో ఎంపీడీఓలు, మండలస్థాయి అధికారులు తుపాన్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో తుపాన్‌కు సంబంధించి నష్టాలను, పరిరక్షణ చర్యల వివరాలను జెడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 70,349 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 20,535 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.10 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

శ్రీవారి సేవలో సినీ హీరో నాని

తిరుమల : తిరుమల శ్రీవారిని సోమవారం సినీ హీరో నాని సేవించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



ఎం.కొత్తూరులో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

వాయు విలయం

తుపాను ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా వాగులు, వంకలు, జలాశయాలు, చెక్‌డ్యాంలు పొంగి పొర్లుతున్నాయి. వర్షం కారణంగా ప్రయాణాలకు ఆటంకం కలిగింది. ఆది, సోమవారాల్లో కురిసిన వర్షాలకు పలు పంటలకు నష్టం వాటిల్లింది. వర్షానికి తోడు గాలివీయడంతో కొన్ని మండలాల్లో చెట్లు నేలకూలాయి. వానకు నానిపోయి పలు ఇళ్ల గోడలు కూలాయి.

- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు, చెరువులు
- ఎన్టీఆర్ జలాశయం నుంచి నీటి విడుదల
- చలిగాలులకు ఇళ్లకే పరిమితమైన జనం
- నీట మునిగిన వరి, టమాట, వేరుశనగ, చిరుధాన్యాల పంటలు
- జిల్లా వ్యాప్తంగా 37.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు
- నేడు మరింత ఉధృతం కానున్న తుపాను ప్రభావం
- అప్రమత్తంగా అధికార గణం

చిత్తూరు అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావంతో సోమవారం జిల్లా వ్యాప్తంగా పెనుగాలులతో కూడిన వర్షం ఎడతెరపి లేకుండా కురిసింది. పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు, చెరువులు పొంగి పొర్లగా, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జలాశయాలకు వరదనీరు అధికంగా చేరుతుండడంతో అధికారులు పెనుమూరు మండలంలోని ఎన్టీఆర్ జలాశయం గేటు ఎత్తివేసి నీటిని విడుదల చేస్తున్నారు. పెనుగాలులకు పలుచోట్ల చెట్లు నేలకొరగగా, ఈదురు గాలులకు ప్రజలు బయటికి రాలేక ఇళ్లకే పరిమితమయ్యారు. వరి, టమాట, వేరుశనగ, చిరుధాన్యాల పంటలు కొంతమేర నీట మునిగాయి. తుపాను ప్రభావం మంగళవారం మరింత ఉధృతం కానున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో అధికారగణం మరింత అప్రమత్తమై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో అధికారులు తక్షణ సహాయక చర్యలు చేపడుతున్నారు. ఎన్టీఆర్ జలాశయంలో ప్రస్తుతం 92 ఎంసీఎఫ్‌టీ మేరకు నీటి నిల్వ ఉండగా, అదనంగా 200 క్యూసెక్కుల మేర వరదనీరు చేరుతుండడంతో అధికారులు ఒక గేటు ఎత్తివేసి 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కృష్ణాపురం జలాశయానికి 128 క్యూసెక్కుల మేర నీరు చేరుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కోత దశలో ఉన్న వరి పంట 38 హెక్టార్లు, వేరుశనగ 20 హెక్టార్లు, చిరుధాన్యాల పంట దాదాపు 40 హెక్టార్ల మేరకు నీట మునిగినట్లు అధికారుల ప్రాథమిక అంచనా వేశారు. ఉద్యాన పంటలు 15 హెక్టార్ల మేరకు నీట మునిగినట్లు అంచనా వేశారు. నగరి నియోజకవర్గం పరిధిలో పలుచోట్ల చెరువులు మొరవలు పారుతుండగా, కుశస్థలి నది వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. సత్రవాడ, నేలపట్టు గ్రామాల్లో రెండు ఇళ్ల గోడలు కూలాయి. కృష్ణరామాపురం గ్రామం వద్ద రహదారిలో పెనుగాలులకు చెట్టు కూలడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

పంటల పరిశీలన



వరిపంటను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏఓ

సోమల: తుపాను ప్రభావం ఆది, సోమవారాల్లో కురిసిన వర్షాలకు మండలంలోని నంజంపేట, మల్లేశ్వరపురం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను సోమవారం తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డితో కలిసి పుంగనూరు ఏడీఏ శివకుమార్ కోత దశలో ఉన్న వరి పంటలు దెబ్బతిన్నట్టు గుర్తించారు. తుపాను ప్రభావం తగ్గేంతవరకు వరి కోతలు కోయవద్దని, పొలంలో నీరు నిలవకుండా అక్కడక్కడా కాలిబాటలు తీయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్, ఆర్ఐ సుబుక్తుల్లా, వీఆర్వో వెంకటరమణ వీఏఏ సుబ్రమణ్యం పాల్గొన్నారు.



మొరవపోతున్న శ్రీకావేరిరాజుపురం చెరువు

వర్షపాతం వివరాలివీ..

తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు సరాసరిన 37.4 మిల్లీ మీటర్ల మేరకు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నగరి మండలంలో 174 మిల్లీ మీటర్లు, విజయపురంలో 150.4 మిల్లీ మీటర్లు, కార్వేటినగరం 99.8, వెదురుకుప్పం 90.8, నింద్ర 81.4, ఎస్ఆర్ పురం 74, పాలసముద్రం 66.8, చిత్తూరు 53.6, పెనుమూరు 50.4, యాదమరి 44.8, గంగాధరనెల్లూరు 34.4, గుడిపాల 31.2, సోమల 23.2, తవణంపల్లె 23, ఐరాల 22.4, రొంపిచెర్ల, పులిచెర్లలో 18.4, చౌడేపల్లె 15.2, పూతలపట్టు 14.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే సదుం మండలంలో 14.2 మిల్లీ మీటర్లు, బంగారుపాళెం 10.4, రామకుప్పం 8.8, పుంగనూరు 8.2, గంగవరం 7.6, పెద్దపంజాణి 5.4, పలమనేరు, వికోటలో 4, బైరెడ్డిపల్లె 3.6, గుడిపాల 2.8, శాంతిపురంలో 2.4 మిల్లీ మీటర్ల మేరకు వర్షపాతం నమోదైంది.







నేసనూరులో నీట మునిగిన వేరుశనగ పంట, నగరి మండలంలో వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న కుశస్థలి నది, వర్షపు నీటితో కలకళలాడుతున్న కృష్ణాపురం జలాశయం, వేపగుంటలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి కోదండయ్య, నగరిపేటలో నివాసాల చుట్టూ వర్షపునీరు

పేదల అభ్యున్నతే జగనన్న లక్ష్యం



పట్టా పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జేసీ శ్రీనివాసులు, ఆర్డీఓ చెన్నయ్య

గంగాధరనెల్లూరు: పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన పేదలకు భూ పంపిణీ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలో కుల, మత, పార్టీలకతీతంగా పేదరికమే అర్హతగా గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని భూమిలేని నిరుపేదలు ఏళ్ల తరబడి తాము సాగు చేసుకుంటున్న భూమికి సంబంధించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు . అర్హత కలిగిన వారికి రెండో దశలో కూడా అతి త్వరలోనే పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. భూ హక్కు పత్రాలను పంపిణీ చారిత్రాత్మకమన్నారు. 70 ఏళ్ల పాలనలో ఏ ముఖ్యమంత్రీ పేదలకు భూ హక్కు కల్పించలేదన్నారు. పేద ప్రజల అభ్యున్నతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని, ఇది పేదల ప్రభుత్వమే కానీ, పెత్తందారుల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమే కానీ మాటల ప్రభుత్వం కాదన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో జీడీనెల్లూరు మండలంలో 238 మందికి 256 ఎకరాలు, వెదురుకుప్పం 74 మందికి 72 ఎకరాల భూమి, కార్వేటినగరం 132 మందికి 152 ఎకరాలు మూడు మండలాల్లో మొత్తం 444 మందికి గాను 480 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిందని తెలిపారు. ఎస్ఆర్ పురం, పెనుమూరు, పాలసముద్రం మండలాల్లోని పేదలకు అర్హత ఆధారంగా త్వరలో భూ పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం భూ హక్కు పత్రాలను డిప్యూటీ సీఎం నారాయణస్వామి , జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీఓ చెన్నయ్య, తహసీల్దార్ ఇన్బానాథన్, ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ హరిబాబు, నేతలు గుణశేఖర్ రెడ్డి, వెంకటరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, వేల్కూరు బాబు రెడ్డి, బండి కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యం కలగకుండా చర్యలు

- మిచాంగ్ తుపాన్ ప్రభావంపై కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్
- పాల్గొన్న కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో తుపాన్ వల్ల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ షణ్మోహన్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. సోమవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక చర్యలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. జిల్లాలో చేపట్టిన సహాయక చర్యలను సీఎంకు వివరించారు. జిల్లాలో ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టామన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులందరినీ అప్రమత్తం చేశామని చెప్పారు. కలెక్టరేట్‌తో పాటు, ప్రతి తహసీల్దార్, ఆర్డీఓ, మునిసిపల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెరువులు, వాగులు, వంకల వద్ద భద్రత పెంచినట్లు తెలిపారు. ముందస్తు ఏర్పాట్లల్లో భాగంగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీటీసీ నిరంజన్ రెడ్డి, డీఈఓ విజయేంద్రరావు, డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ అరుణ, వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదు

తుపాన్ ప్రభావంతో సోమవారం వరకు ఎలాంటి ఆస్తినష్టం జరగలేదని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో మిచాంగ్ తుపాన్‌తో ఎలాంటి నష్టం వాటిల్లలేదని చెప్పారు. అయినప్పటికీ ముందస్తుగా పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 94910 77356, 08572 242777 నంబర్లకు కాల్ చేయాలన్నారు. జిల్లాలో వర్షపాతం 50 నుంచి 55 మి.మీ నమోదైనట్లు తెలిపారు. నగరి నియోజకవర్గంలో వర్షాలు కురవడంతో సోమవారం పాఠశాలలకు సెలవు ఇచ్చామన్నారు. మిగిలిన ప్రాంతాల్లో ఎలాంటి నష్టం లేదన్నారు. అయినప్పటికీ ముందస్తుగా పునరావాస కేంద్రాలు, రేషన్ సిద్ధం ఉంచినట్లు తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు ప్రజలు వాగులు, వంకల వద్దకు వెళ్లకూడదని కోరారు.



కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లతో మాట్లాడుతున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, పాల్గొన్న అధికారులు

ఉత్తమ సేవలకు ఆరోగ్యసేవ పురస్కారం



ఆరోగ్యమిత్రకు ఉత్తమ పురస్కారం అందజేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఉత్తమ సేవలందించిన ఇద్దరు ఆరోగ్యమిత్రలకు ఆరోగ్య సేవ పురస్కారం అందజేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇద్దరు ఆరోగ్యమిత్రలు కలెక్టర్ చేతుల మీదుగా ఆరోగ్య సేవ పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో ఆరోగ్య మిత్రలుగా విధులు నిర్వహిస్తున్న రాణెమ్మ, సరిత ప్రజలకు ఉత్తమ సేవలందించారని తెలిపారు. వైద్యం కోసం ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు వారు అందించిన సేవలు ఎనలేనివని చెప్పారు. ప్రభుత్వ ఆశయాల మేరకు ఆరోగ్యశ్రీ పథకం అమలుపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని తెలిపారు. ఉత్తమ సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన పురస్కారంతో పాటు రూ.5 వేలు నగదు బహుమతిని చెక్కు రూపంలో అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పుష్కరిణిలో ప్రవేశంపై నిషేధం

తిరుపతి కల్చరల్: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కపిలతీర్థంలోని జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయ పుష్కరిణిలోకి భక్తుల ప్రవేశాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు టీటీడీ తెలిపింది. భక్తులు సహకరించాలని కోరింది.

ఓటింగ్‌పై అవగాహన తప్పనిసరి

- కలెక్టరేట్‌లో ఈవీఎం, వీవీప్యాట్‌ల అవగాహన ప్రదర్శన కేంద్రం
- పరిశీలించిన కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఈవీఎం, వీవీప్యాట్‌ల ద్వారా ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ఈవీఎం, వీవీప్యాట్‌ల అవగాహన ప్రదర్శన కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డిలు పర్యవేక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఓటు వేసే విధానం(ఓటింగ్)పై అవగాహన కల్పించేందుకు అవగాహన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా అవగాహన కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలకు ఓటు వేసే విధానాన్ని వివరిస్తారని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించి, వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేయనున్నట్లు చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు కీలకం అన్నారు. ఓటు వేసే విధానంపై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు అని తెలిపారు. కలెక్టరేట్‌కు విచ్చేసే ప్రజలకు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఏఓ కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం ప్రదర్శనను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

క్లుప్తంగా

యూటీఎఫ్ జిల్లా నూతనకార్యవర్గం



సోమశేఖరనాయుడు, మణిగండన్

చిత్తూరు కలెక్టరేట్ : యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్ష కార్యదర్శులు కొమ్మోజు శ్రీనివాసరావు, రాష్ట్ర రఘుపతిరెడ్డి వెల్లడించారు. సోమవారం వారు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా సోమశేఖరనాయుడు (ఐరాల), జిల్లా ప్రధాన కార్యదర్శిగా మణిగండన్ (విజయపురం) ఎన్నికయ్యారన్నారు. అలాగే గౌరవాధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి (తవణంపల్లె), సహాధ్యక్షులుగా మునిరత్నం(నగరి), రెహానాబేగం (యాదమరి), కోశాధికారిగా ప్రసన్నకుమార్ (గంగవరం) ఎన్నికయ్యారని తెలిపారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ సంఘం బలోపేతం, టీచర్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

జర జాగ్రత్తగా ఉండాలి

చిత్తూర రూరల్: వర్షాలతో ప్రజలను అప్రమత్తం చేస్తూ జర జాగ్రత్తగా ఉండేలా చూడాలని డీఎం అండ్‌హెచ్‌ఓ ప్రభావతీదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో సోమవారం మండల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, మాట్లాడారు. కురిసే వర్షాలు అంటువ్యాధులు, విష జ్వరాలు వచ్చే అవకాశాలున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. శుభ్రత పాటించాలన్నారు. జ్వరం కేసు కనిపిస్తే వెంటనే వైద్య సేవలు అందించాలని సూచించారు.

పల్లెవాకిటే పత్రాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. పేదల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తోంది. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోంది. అంతదూరం రాలేక సమస్యలతో సతమతమవుతున్న గ్రామీణుల కోసం స్థానికంగానే జగనన్న సురక్ష పేరుతో క్యాంపులు నిర్వహించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించింది. 11 రకాల సర్టిఫికెట్లను పల్లెల్లోనే పంపిణీ చేసింది. జగనన్న సురక్షలో లబ్ధి పొందిన లబ్ధిదారుల అభిప్రాయాలు వారి మాటల్లోనే.. – చిత్తూరు కలెక్టరేట్



సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులు

పైసా ఖర్చులేకుండా కులధ్రువీకరణ పత్రం



మాది నగరి మండలం. నేను డిగ్రీ చదువుతున్నాను. కళాశాలలో ఇచ్చేందుకు నాకు కులధ్రువీకరణ పత్రం అవసరం అయ్యింది. ఆ ధ్రువీకరణపత్రం కావాలంటే సచివాలయం లేదా మీసేవ కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. సెలవు పెట్టి వెళితే తరగతులు పోతాయి. ఈ సమయంలో సర్వే చేసి, నాకు అవసరమైన కులధ్రువీకరణ పత్రాన్ని వలంటీర్ ఇంటి వద్దకే తెచ్చిచారు. పైసా ఖర్చు లేకుండా ధ్రువపత్రం ఇచ్చారు. చాలా సంతోషం వేసింది.

- కంచి వెంకటేశులు, ఎం.కొత్తూరు గ్రామం, నగరి మండలం

ఒక్కరోజులోనే ఆదాయ, కులధ్రువీకరణ పత్రం



మాది నగరి మునిసిపాలిటీ పరిధిలో ఆది ఆంధ్ర వాడ. ఇప్పటికే ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చాలా లబ్ధి పొందాను. ఆదాయ, కులధ్రువీకరణ పత్రం పొందాలంటే గతంలో చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. అయితే నాకు అవసరమున్న ధ్రువపత్రాలేమో అధికారులే మా ఇంటి వద్దకు వచ్చి తెలుసుకుని వెళ్లి ఇంటికే తెచ్చి ఇచ్చారు. ఒకే రోజులో నాకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువపత్రాలు తెచ్చి ఇచ్చారు. ఇంతటి మంచి కార్యక్రమాలు చేస్తున్న సీఎంకు రుణపడి ఉంటాం.

- పుష్పలత, కాకవేడు ఆది ఆంధ్రవాడ, నగరి మున్సిపాలిటీ

పేదలకు మంచి జరుగుతోంది



మాది పుత్తూరు మునిసిపాలిటీ పరిధిలోని కట్టకింద రామకృష్ణాపురం. గతంలో కులధ్రువీకరణపత్రం కావాలంటే ఇచ్చే వారే కాదు. ఏవేవో పత్రాలు కావాలని చెప్పి ఇబ్బందులు పెట్టేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నాకు ఒకరోజులోనే కులధ్రువీకరణ పత్రం ఇచ్చారు. ఈ ప్రభుత్వంలో పేదలకు మంచి జరుగుతోంది. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంతో నాలాంటి పేదలకు ఎంతో మేలు కలుగుతోంది.

-యువరాజ్, కట్టకింద రామకృష్ణాపురం, పుత్తూరు మున్సిపాలిటీ

బియ్యంకార్డు ఇబ్బంది తొలిగింది



మాది పుత్తూరు మునిసిపాలిటీలోని పల్లూరు. మాకు చాలా ఏళ్లుగా బియ్యం కార్డు లేదు. టీడీపీ ప్రభుత్వంలో బియ్యం కార్డు కోసం అధికారులకు, జన్మభూమి కమిటీల్లో దరఖాస్తులు ఇచ్చాను. ఆ దరఖాస్తులను అప్పటి పాలకులు పరిశీలించకుండానే చెత్తకుప్పలో పడేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సార్ నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో మా సమస్యను తెలుసుకుని మరీ బియ్యం కార్డును మంజూరు చేశారు. మాలాంటి పేదలకు మేలు చేస్తున్న సీఎం జగనన్న మేలు ఎప్పటికీ మరిచిపోము.

-గీత, పల్లూరు, పుత్తూరు మున్సిపాలిటీ

దాతృత్వం ఎనలేనిది



జగనన్న మొబైల్ అన్నదాన క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- సీఎం జగనన్న స్ఫూర్తితో పేదల ఆకలి తీరుస్తున్న విజయానందరెడ్డి
- కలెక్టరేట్ వద్ద ఉచిత అన్నదాన మొబైల్ క్యాంటిన్ వాహనం ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : 'ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి దాతృత్వం ఎనలేనిది. పేదల ఆకలి తీర్చేందుకు జగనన్న మొబైల్ ఉచిత అన్నదాన క్యాంటిన్‌ను నెలకొల్పడం గొప్ప విషయం',అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి జగనన్న ఉచిత క్యాంటిన్ పేరుతో మొబైల్ వాహనాన్ని నెలకొల్పారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఈ వాహనాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం మాట్లాడుతూ విజయానందరరెడ్డి ఏర్పాటు చేసిన జగనన్న క్యాంటిన్ ద్వారా నగరంలో రోజుకు 500 మందికి ఉచితంగా అన్నదానం చేయనున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఏర్పడినప్పటి నుంచి విజయానందరెడ్డి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు 500 మందికి నగరంలోని వివిధ ప్రాంతాల్లో అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్, మంగళవారం కోర్టు ఆవరణ, బుధవారం పాత బస్టాండ్, గురువారం గాంధీ సర్కిల్ శుక్రవారం మసీదుల వద్ద, శనివారం పీసీఆర్ సర్కిల్, ఆదివారం చర్చిల వద్ద జగనన్న క్యాంటీన్ మొబైల్ వాహనం ద్వారా అన్నదానం చేయిస్తామని చెప్పారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. పేదల కోసం సీఎం జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని, సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తున్నారన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేశ్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు మధు, శ్రీకాంత్, అంబురాసనపల్లి ప్రకాశ్, అల్తాఫ్ కౌసర్, కవిత, దలవాయి శివ, నవాజ్ పాల్గొన్నారు.

టెన్నిస్ తారాజువ్వ సుమేరా

టెన్నిస్ వినీలాకాశంలో సుమేరా తారాజువ్వలా మెరిసింది. పట్టుదల.. నిరంతర సాధనతో విజయపథంలో దూసుకెళుతోంది. రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో సత్తాచాటి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ఔరా అనిపించింది.ప్రస్తుతం ముంబాయిలో జరగనున్న జాతీయస్థాయి టెన్నిస్ పోటీలకు సిద్ధమవుతోంది.

- రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో సత్తా చాటిన చిత్తూరు చిన్నారి
- గోల్డ్ మెడల్ సొంతం
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



టెన్నిస్ ప్రాక్టీసులో సుమేరా

చిత్తూరు అర్బన్: నగరంలోని రెడ్డిగుంటకు చెందిన తమీమ్ అన్సారీ, రూబి ఫజీనా దంపతుల కుమార్తె సుమేరా అన్సారీ. సత్యనారాయణపురంలోని బీవీరెడ్డి స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతోంది. తండ్రి ప్రోత్సాహంతో నాలుగేళ్ల క్రితం టెన్నిస్ వైపు మొగ్గు చూపింది. అప్పటి నుంచి టెన్నిస్ ప్రాక్టీసుకు ప్రాధాన్యత ఇస్తోంది. తొలిసారిగా 2022 తిరుపతి పాలిటెక్నిక్ కాలేజీలో జరిగిన అండర్ -14 జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో పాల్గొంది. ఈ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరచి, మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అక్కడ మూడో స్థానంలో నిలిచింది. 2023 సెప్టెంబర్‌లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో జరిగిన అండర్ -14 జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో సత్తా చాటింది. దీంతో సుమేరాకు కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అవకాశం లభించింది. ఈ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి, గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో మహారాష్ట్ర షోలాపూర్‌లో 2024 జనవరిలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఇందుకు ఇప్పటి నుంచే క్రీడా సాధన చేస్తోంది.

క్రీడాలంటే ఇష్టం...

తనకు చిన్నప్పటి నుంచి క్రీడాలంటే ఇష్టం. టెన్నిస్ అంటే ప్రాణం. మా నాన్న దగ్గరుండి ప్రోత్సాహిస్తున్నారు. అందుకే టెన్నిస్‌పై నాకు మరింత ఇష్టం పెరిగింది. నిరంతరం ప్రాక్టీసు చేస్తుంటాను. చదువుకు సమయం కేటాయించడంతో పాటు ఖాళీ సమయం దొరికితే టెన్నిస్ ఆడుతున్నా. రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ రావడం ఆనందంగా ఉంది. జాతీయ స్థాయిలో కచ్చితంగా మెడల్ సాధిస్తాననే నమ్మకం ఉంది. అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు వెళ్లాలన్నదే తన ధ్యేయం.

-సుమేరా అన్సారీ, చిత్తూరు

ఆందోళన వద్దు.. అండగా ఉంటాం



సమస్యలు తెలుసుకుంటున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

-ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. తాము అండగా ఉంటామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం 4వ వార్డు పరిధిలోని ఏనుగుల గుంట చెరువు సమీపంలో ఉన్న లోతట్టు ప్రాంతా ల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఎలాంటి సమస్య ఉన్నా తన ఫోన్ నంబర్ 9845009152కు కాల్ చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు భోజనాలు, వసతి ఏర్పాటు చేయా లని అధికారులను ఆదేశించారు. అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు శ్రీకాళహస్తి పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పార్టీ నాయకులు పగడాల రాజు, పంతులు, శంకర్, ప్రభాకర్, భారతి, మున్నా, పఠాన్ ఫరీద్ ఉన్నారు.

సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్: మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో విజయవాడకు వెళ్లే పలు రైళ్లు రద్దు చేసిన నేపథ్యంలో సోమవారం ఆర్టీసీ బస్టాండ్‌కు విజయవాడకు వెళ్లాల్సిన పలువురు ప్రయాణికులు చేరుకున్నారు. దీంతో సమాచారం అందుకున్న జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి నుంచి విజయవాడకు 20 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు 3 ప్రత్యేక సర్వీసులు సమకూర్చారు. ఆ మేరకు డిప్యూటీ సీటీఎం భాస్కర్, డీఎం బాలాజీ, ఏటీఎం రామచంద్రనాయుడు, అసిస్టెంట్ టీఎం పద్మావతి తిరుపతి బస్టాండ్‌లో ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. ప్రత్యేక సర్వీసులను ఆటంకాలు లేకుండా ఎప్పటికప్పుడు రద్దీ ఆధారంగా నడపనున్నట్లు తెలిపారు. ఈ బాధ్యతలను ఎస్టీఐ బ్రహ్మం, సూపర్‌వైజర్లు సత్యనారాయణ, ఈఆర్‌కుమార్, ఎంటీఆర్ రెడ్డి తదితరులకు బాధ్యతలు అప్పగించారు.

శ్రీవారి సేవలో శ్రీరంగం మఠం పీఠాధిపతి

తిరుమల : తిరుమల శ్రీవారిని శ్రీరంగం మఠం పీఠాధిపతి, ఆండవన్ ఆశ్రమ ప్రధాన పీఠాధిపతి వరాహ మహాదేశికన్ (ఆండవన్) దర్శించుకున్నారు. సోమవారం శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బాక్సింగ్ క్రీడాకారిణి శోభారెడ్డి సన్మానం



క్రీడాకారిణి శోభారెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలం దాసరిపల్లెకు చెందిన బాక్సింగ్ క్రీడాకారిణి శోభారెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డితో కలసి ఆర్థిక సాయం చేశారు. గత నవంబర్‌లో విశాఖ పట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి ఉమెన్స్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఆమెను సన్మానించారు. అనంతరం పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారిణి శోభారెడ్డి జాతీయ స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయిలో పెనుమూరు మండలానికి గుర్తింపు తీసుకురావాలన్నారు. క్రీడాకారిణి శోభారెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుబడిన తనని తన భర్త చంద్రశేఖర్‌రెడ్డి ప్రోత్సాహించడంతోనే బాక్సింగ్ పోటీల్లో రాణిస్తున్నాని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూదిమోహన్, సచివాలయ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నాయకులు భీమారెడ్డి, యతీశ్వర్‌నాయుడు, హేమంత్‌రెడ్డి, దూది మునీంద్ర పాల్గొన్నారు.

అంతర్జాతీయ దొంగల అరెస్టు



అంతర్జాతీయ దొంగల అరెస్టు చూపుతున్న సీఐ సత్యబాబు

కార్వేటినగరం: అంతర్జాతీయ దొంగల ముఠాను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు కార్వేటినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీ. సత్యబాబు తెలిపారు. సోమవారం సీఐ కార్యాలయంలో అంతర్జాతీయ దొంగలను అరెస్టు చూపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పాలసముద్రం మండలం బలిజకండ్రిగలో ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు అందిన ఫిర్యాదుతో డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో టీమ్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. దీంతో సోమవారం ఉదయం బలిజకండ్రిగ క్రాస్ వద్ద వాహనాల తనిఖీ నిమిత్తం రెండు ద్విచక్రవాహనాల్లో వెళుతున్న వారిని ఆపడంతో వారు వాహనాల వేగాన్ని పెంచి పరారయ్యేందుకు యత్నించడంతో అనుమానం వచ్చి వారిని అదుపులోకి తీసుకుని విచారణ జరిపామన్నారు. తమిళనాడులోని రాణిపేట జిల్లా జట్టేరి కాలనీకి చెందిన శశికుమార్ కుమారుడు ఎస్.పొన్మణి, తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం శ్రీరామపురం గ్రామానికి చెందిన చిరంజీవి కుమారుడు ఆనంద్, తమిళనాడులోని తిరవళ్లూరు జిల్లా వీసీఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన మునియప్పన్ కుమారుడు ఎం.కిషోర్, అదే గ్రామానికి చెందిన రవి కుమారుడు ఆర్.కార్తీక్‌గా గుర్తించామని చెప్పారు. వీరు ఆంధ్రప్రదేశ్‌లో పలు చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. బలిజకండ్రిగ గ్రామంలో కూడా చోరీకి పాల్పడినట్లు వారు అంగీకరించారని చెప్పారు. దీంతో వారి వద్ద నుంచి రెండు ద్విచక్రవాహనాలు, మూడు ల్యాప్‌టాప్‌లు, 18.7 గ్రాముల పగడాల బంగారు చైనుతో పాటు ఉంగరం, కమ్మలు, ఒక ఒక మోనిటర్‌ను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ. 2.40 లక్షలు ఉంటుందన్నారు. సమావేశంలో ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సీజ్.. నిందితుడి అరెస్టు



నిందితుడ్ని అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక నుంచి కారులో మద్యం తరలిస్తున్న కె.జ్యోతీశ్వరయ్య (38) అనే నిందితుడ్ని ఎస్ఈబీ చిత్తూరు రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ చంద్రశేఖర్, ట్రైనీ ఏఈఎస్ శ్రీరామ్ ఆధ్వర్యంలో బంగారుపాళెం మండలం గాజులపల్లె రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఇటువైపుగా వస్తున్న ఓ కారు పోలీసులను గమనించి వేగంగా వెళ్లడానికి ప్రయత్నించగా వారు చాకచక్యంగా పట్టుకున్నారు. కారులో తనిఖీలు చేయగా 288 కర్ణాటక మద్యం ప్యాకెట్లు ఉండడంతో జ్యోతీశ్వరయ్య అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండుకు తరలించారు. ఈ దాడుల్లో ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం, కిరణ్‌కుమార్, వెంకటేష్, మమత తదితరులు పాల్గొన్నారు.

పంటలపై గజదాడులు



చల్లావారిపల్లెలో ఏనుగులు ధ్వంసం చేసిన వరిపంట



పెద్దపంజాణి: ఏనుగులు ధ్వంసం చేసిన వరి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని చల్లావారిపల్లె సమీపంలోని పొలాలపై సోమవారం వేకువజామున ఏనుగులు దాడి చేసి పంటలను నాశనం చేశాయి. రైతు సదాశివరెడ్డి పొలంలో వరి పంటను ధ్వంసం చేయడంతో తీవ్రనష్టం జరిగింది. పదిరోజుల క్రితం కూడా ఇదే పొలంలో ఏనుగులు పడి పంటను నాశనం చేయడం జరిగింది. గత మూడు నెలలుగా మండలంలోనే తిష్ట వేసి, ఎక్కడో ఒకచోట పంటలను నాశనం చేస్తూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు వీటిని అటవీ ప్రాంతం వైపు మళ్లించి పంటలను కాపాడాలని కోరుతున్నారు.

పెద్దకాప్పల్లిలో..

పెద్దపంజాణి: పెద్దకాప్పల్లి పంచాయతీలోని అటవీ సరిహద్దు గ్రామాల్లో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం రాత్రి పేటూరు ఫారెస్టు బీట్ నుంచి వచ్చిన ఏనుగులు పెనుగొలకల గ్రామానికి చెందిన మునస్వామి, నాగరాజ, సుందరప్ప, పెద్దకాప్పల్లికి చెందిన రమణారెడ్డి తదితరులు సాగు చేసిన వరి పంటను తొక్కి, నాశనం చేశాయి. సోమవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు ధ్వంసమై ఉండడాన్ని చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు.